సాక్షి నిర్మల్

మంగళవారం । 14 । జనవరి । 2025



భోగి మంట వద్ద నృత్యం చేస్తున్న యువతి

చప్పట్లు కొడుతూ భోగి మంట చుట్టూ తిరుగుతున్న మహిళలు, యువతులు



నిర్మల్ శ్రీనగర్‌కాలనీలో గంగిరెద్దుకు ధాన్యం పోస్తున్న కుటుంబీకులు



చిన్నారులకు భోగి పండ్లు పోస్తూ..



భోగిమంటకు నమస్కరిస్తూ...



గాలిపటం ఎగురవేస్తున్న చిన్నారి

సంబురంగా భోగి

మూడు రోజుల సంక్రాంతి వేడుకలు భోగితో జిల్లాలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఊరూరా, వాడవాడలా కూడళ్లలో సోమవారం వేకువజామునే భోగి మంటలు వేశారు. ఇళ్లలోని పాత వస్తువులను ఆ మంటల్లో వేసి కష్టాలు, నష్టాలు, కోపాలు తాపాలు దహించుకుపోవాలని పూజలు చేశారు. అందరికీ భోగభాగ్యాలు ఇవ్వాలని వేడుకున్నారు. అనంతరం భోగి మంటల చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. అనంతరం మహిళలు, యువతులు ముంగిళ్లలో అందమైన రంగవల్లులు వేశారు. ముగ్గుల్లో గొబ్బెమ్మలను ఉంచి పూజించారు. తర్వాత చిన్నారులకు భోగిపండ్లు పోశారు. ఇక పట్టణాల్లో పతంగుల సందడి కనిపించింది. పిల్లలు పెద్దలు పతంగులు ఎగురవేశారు.

– నిర్మల్‌టౌన్/సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

న్యూస్‌రీల్

కుమ్మరుల జీవన ప్రమాణాల మెరుగునకు కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: కుమ్మరుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడంతోపాటూ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక గౌరవాన్ని కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలో కుమ్మరి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(కేవా) రూపొందించిన నూతనసంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుమ్మరి సామాజిక వర్గ వ్యక్తులు ఉన్నతంగా ఎదుగుతూనే, సామాజిక సేవలోనూ ముందుండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవా జిల్లా అధ్యక్షుడు తొడిశెట్టి పరమేశ్వర్, జిల్లా నాయకులు చంద్రయ్య, మరుపాక శ్రీనివాస్, ప్రసాద్, శ్యాంసుందర్, శంకర్, నారాయణ, రవికాంత్ పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన జిల్లావాసికి సన్మానం



భోజన్నను సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌ఖిల్లా: విద్యాశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఇటీవల జనగామ జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పదోన్నతి పొందిన జిల్లాకేంద్రానికి చెందిన దర్శనం భోజన్నను తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్)ఆధ్వర్యంలో సన్మానించారు. పట్టణంలోని మంజులాపూర్‌కు చెందిన భోజన్న గతంలో నిర్మల్ జిల్లా విద్యాశాఖలో, ఆదిలాబాద్ డైట్ కళాశాలలో పర్యవేక్షకులుగా బాధ్యతలు నిర్వర్తించారు. నిర్మల్ జిల్లా ఏర్పాటు అనంతరం మొదటి ఏడీగా పదోన్నతి పొంది విద్యాశాఖకు మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.మురళిమనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్, వహీద్‌ఖాన్, నాయకులు ఎస్.శరత్ చందర్‌రెడ్డి, మేడారం శ్రీనివాస్, మతీన్, వి.ముత్తన్న, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గులో 'సేద్యం'



నిర్మల్‌ఖిల్లా: సంక్రాంతి పండగ అంటేనే వ్యవసాయదారుల పండగ.. పంట చేతికి వచ్చి రైతు ఆనందంగా ఉండే రోజు ఇది. ఇదే అంశంతో సంక్రాంతి రంగవల్లికను తీర్చిదిద్దాడు ఓ యువకుడు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌కు చెందిన అడ్డిగ శ్రవణ్ సంక్రాంతి నేపథ్యంలో వేసిన ముగ్గులో కర్షకుడిని గౌరవించమంటూ.. ''రెస్పెక్ట్ ద ఫార్మర్'' అనే అక్షరాలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దాడు.

సంక్రాంతి సందళ్లు

పల్లె పట్నం తేడాలేకుండా ఎంతో ఇష్టంగా జరుపుకునే మకర సంక్రాంతి. గ్రామీణ వాతావరణం ఉమ్మడి కుటుంబాలు, అనుబంధాలు, ఆత్మీయతల సమ్మేళనాలతో అన్ని కుటుంబాల్లో ప్రత్యేక శోభ నింపుతుంది. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడంతో ఉత్తరాయణ పుణ్యకాలంతో సంక్రాంతి ప్రారంభమవుతుంది. కర్కాటక రాశిలో ఉన్న సూర్యుడు మకర రాశిలోకి సంచారం చేయడంతోపాటు, పుష్య నక్షత్ర యుక్తంగా ఈసారి మకర సంక్రాంతి చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది. మూడు రోజుల పండుగలో భాగంగా సోమవారం భోగితో జిల్లాలో సందళ్లు మొదలయ్యాయి. జిల్లాలో చిన్న పిల్లలపై భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. భోగి పండ్లు పోయడం వల్ల పిల్లల మీద ఉన్న చెడుదృష్టి కూడా తొలగిపోతుందని నమ్మకం. జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాలలో ఈ సంప్రదాయం సోమవారం రోజున కొనసాగింది. వేకువ జామునే ప్రధాన కూడళ్లలో భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు.

– నిర్మల్‌ఖిల్లా

- మొదలైన మూడురోజుల సంబరాలు...
- ముగ్గులు, గొబ్బెమ్మలు, పతంగులు...
- చిన్నారులకు భోగిపండ్ల వేడుకలు
- ఉమ్మడి పరివార సందళ్లు...
- నేడు సంక్రాంతి, రేపు కనుమ...



జిల్లా కేంద్రంలోని బస్ డిపో బోయవాడలో భోగి మంటకు మంగళ హారతి ఇస్తున్న మహిళలు



నిర్మల్‌లో ముగ్గు వేస్తున్న యువతులు



నిర్మల్‌లో గంగిరెద్దు సందడి...

నేడు మకర సంక్రాంతి...

సంక్రాంతి అంటే వెలుగుతో కూడిన గమ్యం అని అర్థం. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే శుభ దినాన నువ్వులు, బెల్లం కలిపి లడ్డూలు చేసుకుని నోములు నోచుకోవడం ప్రత్యేకం. మకర సంక్రమణం రోజున నువ్వుల నూనెలో లక్ష్మీదేవి కొలువై ఉంటుందని ప్రతీతి. అందుకే దేవుని పూజించి నువ్వుల లడ్డూలను ప్రసాదంగా స్వీకరిస్తారు. ఇలా చేయడం వల్ల దీర్ఘాయుష్షు చేకూరుతుందని శాస్త్రం చెబుతుంది.

సమైక్య'కాంతి'..

సంక్రాంతి పర్వదినం వైభవంగా జరుపుకునేందుకు దూరప్రాంతాల్లో ఉంటున్న జిల్లా వాసులు తమ స్వస్థలాలకు వచ్చేశారు. సొంత ఊళ్లలో, సొంత ఇంటిలో మూడుతరాల ముచ్చట్లమధ్యన సమైక్యంగా పండగ సంబరాలను నిర్వహించుకుంటున్నారు.

సక్కరివారి పరివారం..



ఈ చిత్రంలో కనిపిస్తున్న పరివారం అంతా ఒకే కుటుంబానికి చెందినది. ఇందులో మూడు తరాలవారు ఉన్నారు. ఉద్యోగం, ఉపాధి రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడగా సంక్రాంతి పండుగకు అంత ఒకే చోట కలుసుకోవాలని నిర్ణయించుకుని రెండేళ్లుగా ఈ ఆనవాయితీని పాటిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం టెంబుర్ని గ్రామసమీపంలో వీరంతా ఒకేచోట కలుసుకున్నారు. సోమవారం అక్కడి శ్రీచక్ర లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ముంపులో భాగంగా మూడు దశాబ్దాల క్రితం తమ గ్రామం అంతరించిపోగా అప్పటి కుటుంబానికి చెందిన అన్నదమ్ములు తమ పిల్లలతో వెళ్లిపోయి వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నర్సాపూర్(జి), భైంసా, నిర్మల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలలో ఉపాధి నిమిత్తం వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. వీరంతా సంక్రాంతి పండుగ సందర్భంగా కలుసుకుంటున్నారు. తమ సక్కరి పరివార నేపథ్యం తాతలు, తండ్రులు వారి వంశవృక్షం నేటి తమ నాలుగో తరం చిన్నారులకు తెలియ చెప్పాలనే ఉద్దేశంతోపాటు బంధాలు అనుబంధాల ప్రాధాన్యతను చాటాలని ఏటా ఇలా కలుసుకుంటున్నామని రెండో తరం కుటుంబసభ్యులైన విఠల్, వినాయక్, రుద్రమదేవి, సుధాకర్, మధుకర్ పేర్కొన్నారు.

పథకాల పండుగ

- సంక్రాంతి తర్వాత మూడు అమలు
- ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా
- కొత్త రేషన్‌కార్డుల జారీకి కార్యాచరణ సిద్ధం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సంక్రాంతి పండుగ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ ప్రారంభం కానుంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ప్రజాపాలన దరఖాస్తులు, కుటుంబ సర్వేలో ప్రజలు పేర్కొన్న వివరాల ఆధారంగా ఇంటింటి సర్వే పూర్తయింది. అర్హులను గుర్తించేందుకు ఉమ్మడి జిల్లాలో అధికారులు ప్రతీ గడపకు వెళ్లి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేశారు. అక్కడక్కడ సమస్యలు ఉన్నా పరిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగ తర్వాత ఉమ్మడి జిల్లాలో సంక్షేమ పథకాల పండుగ మొదలు కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు అంతా సక్రమంగా సాగేలా దిశానిర్దేశం చేసింది. పథకాల ఎంపికకు కీలకంగా మారిన గ్రామసభల్లో ఈ నెల 24లోపు అర్హులను గుర్తించాల్సి ఉంది. పండుగ తర్వాత అధికార యంత్రాంగం పథకాల అమలుపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనుంది. మరోవైపు ఈ నెల 26 తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటన చేస్తానని ప్రకటించడంతో ఉమ్మడి జిల్లా అధికారులు అప్రమత్తం అయ్యారు.

తగ్గనున్న రైతు భరోసా

ఈ నెల 16నుంచి రైతుభరోసా కోసం సాగు సర్వే మొదలు కానుంది. నాలుగు రోజుల్లో అంటే 20వరకు సర్వే పూర్తి చేసి సాగు భూముల లెక్క తేల్చాలి ఉంది. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు చేపట్టే ఈ సర్వేలో పట్టాభూములుగా ఉండి, సాగులో ఉన్నట్లు ధ్రువీకరిస్తేనే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఎకరానికి రూ.12వేల చొప్పున అందనుంది. ఉమ్మడి జిల్లాలో చాలా భూములు రియల్ వెంచర్లుగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల రోడ్లు, వ్యాపార కార్యక్రమాల కోసం వినియోగిస్తున్నారు. కొన్నిచోట్ల ఇంకా రెవెన్యూ రికార్డుల్లో సాగు భూములుగానే కొనసాగుతున్నాయి. వీటిపైన సమగ్రంగా సర్వేచేసి లబ్ధిదారులను తేల్చనున్నారు. గతంలో గుట్టలు, అటవీ భూములు, రోడ్లు, వెంచర్లు, వాగులు, వంకల్లో ఉన్న భూములు, పట్టణ శివార్లలో ఇళ్ల స్థలాలకు సైతం పెట్టుబడి సాయం అందింది. తాజా సర్వేతో గత ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు కంటే భరోసా లబ్ధిదారులు తగ్గే అవకాశం ఉంది.

ఇందిరమ్మ ఇళ్లు

గూడు లేని నిరుపేదలకు ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేయనున్నారు. ఇప్పటికే సర్వే పూర్తి కాగా, అర్హులను ప్రకటించాల్సి ఉంది. ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లా పరిధిలో గిరిజన ప్రాంతాలతో సహా గ్రామ, పట్టణాల్లో నిర్వహించే సభల్లోనే అర్హులను ఎంపిక చేయనున్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు

కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి భారీ ఊరట కలుగనుంది. పాత విధానంలోనే కొత్త రేషన్ కార్డులు జారీ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. పెళ్లయిన వారు, చిన్న పిల్లల పేర్ల మార్పులు, చేర్పులు, కుటుంబాల నుంచి వేర్వేరుగా ఉన్న వారికి రేషన్ కార్డుల అవసరం ఏర్పడుతోంది. ప్రస్తుతం పథకాలు రేషన్‌కార్డుల ఆధారంగానే ఎంపిక చేస్తున్న తరుణంలో కార్డుల కోసం అనేక మంది ఎదురుచూస్తున్నారు. ఇక భూమి లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12వేల సాయం అందనుంది. ఇందుకు ఉపాధిహామీ పథకంలో కనీసం 20రోజులు పని దినాలు చేసినట్లు నమోదై ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు.

తర్వాత 'స్థానిక'ం

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో కీలకమైన ఈ మూడు సంక్షేమ పథకాల అమలు మొదలైన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే పోలింగ్ కేంద్రాలు, వార్డులు, ఓటర్ల మార్పులు, చేర్పులతో తుది జాబితా వెలువడింది. నాయకులు సైతం ఎన్నికల కోసం సన్నద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో పథకాల అమలు జరిగాక పంచాయతీ, మండల, జెడ్పీ, ఆ తర్వాత పట్టణ పరిధిలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

దుబాయ్‌లో వివేకానంద జయంతి

ఖానాపూర్: దుబాయ్‌లోని జెబల్ అలీ ప్రాంతంలోని లాల్ క్యాంపులో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించినట్లు జిల్లాకు చెందిన గల్ఫ్ కార్మికులు తెలిపారు. యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికులు పవన్ సాయి, లింగదాస్, చంద్రశేఖర్, పెద్ది రవి, అశోక్, కిశోర్, శంకర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



జయంతి వేడుకల్లో పాల్గొన్న గల్ఫ్ కార్మికులు

కల్యాణం.. కమనీయం..

దేవరకోట ఆలయంలో గోదారంగనాథుల కల్యాణం తిలకిస్తున్న భక్తులు



మాంగల్యధారణ చేస్తున్న అర్చకులు



బాగులవాడ రామాలయంలో గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు





భైంసాలో వేడుకలకు వచ్చిన భక్తులు..



ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నిర్మల్ పట్టణంలోని బాగులవాడ రామాలయంలో, దేవరకోట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో , భైంసా పట్టణంలోని పద్మావతికాలనీలోని శ్రీవేంకటేశ్వరాలయంలో సోమవారం గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయాల ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపైకి ఉత్సవమూర్తులను భాజాభజంత్రీలు, మేళతాళాలు, భక్తుల కోలాటాల నడుమ తీసుకువచ్చారు. దేవరకోట ఆలయంలో ఉత్సవమూర్తులను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవంలో భారీగా భక్తులు పాల్గొన్నారు. గోవిందనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. గంగోత్రిధామ్‌కు చెందిన శ్రీరామానుజదాస్, ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగు రవికిషన్‌గౌడ్, అర్చకులు నవీన్, రామకన్నన్, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్/నిర్మల్‌టౌన్/భైంసాటౌన్

న్యూస్‌రీల్

జాతీయ స్థాయిలో వెండి పతకం


ఓరగంటి అక్షయ

నేరడిగొండ(బోథ్‌): నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన ఓరగంటి అక్షయ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వెండి పతకం సాధించింది. మెదక్ జిల్లాలోని 21వ సౌత్‌జోన్ పోటీల్లో రాణించి సాఫ్ట్‌బాల్ సౌత్ జోన్ తెలంగాణ జట్టుకు ఎంపికైంది. పుదుచ్చేరిలో జరిగిన 21వ సౌత్ జోన్ సాఫ్ట్ బాల్ పురుషులు, మహిళల చాంపియన్‌షిప్‌లో పాల్గొని ఫైనల్‌లో కేరళపై 2–3 తేడాతో తెలంగాణ జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఇందులో పాల్గొన్న అక్షయ కీలక పాత్ర పోషించింది.

గిరిజనులతో మమేకమై..


గ్రామస్తులతో ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ

కడెం: విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే ఎస్పీ జానకీషర్మిల, ఏఎస్పీ రాజేశ్‌మీనాలు కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని మారుమూల ఆటవీ గ్రామం లక్ష్మీపూర్‌ను సోమవారం సందర్శించారు. గూడేనికి వచ్చిన ఎస్పీ, ఏఎస్పీలకు ఆదివాసీలు సంప్రదాయ వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఆదివాసీ మహిళలతో కలిసి ఎస్పీ నృత్యం చేశారు. ఆదివాసీ యువత ఉన్నత చదవులు చదివి, ఉద్యోగాలు సాధించాలని సూచించారు. సైబర్ మోసలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కడెం ప్రాజెక్టును సందర్శించారు. బోటింగ్ చేశారు. వీరి వెంట సీఐ సైదారావు, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ఉన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఈ నెల 10న అదృశ్యమైన పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బోంపల్లి నరేందర్ (30) మృతదేహం సోమవారం లభ్యమైనట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 9న ఇంటి నుంచి బయలుదేరిన నరేందర్ ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో అతని తండ్రికి కనిపించాడు. మరుసటి రోజు నుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. జైనథ్ మండలంలోని పెన్‌గంగలో శవమై తేలినట్లు వివరించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

మీ పోలీస్ పనితీరు ఎలా ఉంది?

- పోలీసుల్లో మార్పు తెచ్చేందుకే వినూత్న ప్రయత్నం
- అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ
- ఐదు అంశాలపై..
- పోలీసు స్టేషన్‌లలో సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్ ఏర్పాటు

ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలక్రైం: పోలీసులు, పోలీసు స్టేషన్‌ల పనితీరుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. పోలీసు స్టేషన్‌లకు వచ్చేవారితో సిబ్బంది, అధికారులు ప్రదర్శిస్తున్న తీరుపై ఆరా తీసేందుకు చర్యలు చేపట్టింది. ఐదు అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతోంది. సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్‌లో బాధితులు, జనాలు పోలీసుల పనితీరుపై అభిప్రాయం తెలియజేయవచ్చు. పోలీసు స్టేషన్‌లలో వేచి ఉండే గది, ప్రజలకు కల్పిస్తున్న సేవలు, సమస్య పరిష్కారమైందా.. లేదా తదితర అంశాల గురించి వివరించేందుకు అవకాశం కల్పించింది. ఇదివరకు డీజీపీ కార్యాలయం నుంచి ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి సమాచారం అడిగేవారు. సమస్య పరిష్కారం అయ్యిందా.. లేదా, సిబ్బంది తీరు ఎలా ఉంది.. తదితర విషయాలపై ఆరా తీసేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి పోలీసు స్టేషన్, పోలీసుల పనితీరుపై మనం ఫీడ్‌బ్యాక్ ఇచ్చే అవకాశం ఉంది. పోలీసు అధికారులు జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్‌లలో ఈ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. పోలీస్‌శాఖ సేవలను మరింత మెరుగు పరిచేందుకు, క్యూఆర్ కోడ్‌ద్వారా పోలీసుల పనితీరు, ప్రవర్తనా నియమావళిపై ప్రజల నుంచి నేరుగా తెలుసుకునేందుకు ఈనెల 9న డీజీపీ జితేందర్ ఫీడ్‌బ్యాక్ సేకరణను రాష్ట్రవ్యాప్తంగా వర్చువల్ ద్వారా ప్రారంభించారు.



ఆదిలాబాద్ పోలీసు స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న ఫిర్యాదుదారుడు

ఆన్‌లైన్ ద్వారా ఫీడ్‌బ్యాక్..

ఆన్‌లైన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పేరు, పోలీసు స్టేషన్ పరిధి, మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్, సమస్యను విన్నవించడం, పోలీసు పనితీరు ఎలా ఉందనే అంశాలను పూరించాల్సి ఉంటుంది. తర్వాత పోలీసులు తిరిగి కాల్ చేయవచ్చా.. లేదా అనే ఆప్షన్ ఉంటుంది. వివరాలను అప్‌లోడ్ చేస్తే జిల్లా ఎస్పీతో పాటు డీజీపీ కార్యాలయానికి మెస్సేజ్ వెళ్తుంది. ఈ సమాచారం ద్వారా పోలీసు స్టేషన్, అధికారుల పనితీరు తేటతెల్లం అవుతుంది. అభిప్రాయ సేకరణలో ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, ఈ–చలాన్, ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్‌పోర్టు ధ్రువీకరణ తదితర అంశాలకు సంబంధించి ఫీడ్‌బ్యాక్ ఇవ్వొచ్చు. ప్రజల నుంచి అందిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోనున్నారు. ఫీడ్‌బ్యాక్ అందించిన వారిపేర్లు గోప్యంగానే ఉంచబడుతాయి. ఈ విధానం ద్వారా సిబ్బందిలో మార్పురావడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పోలీస్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

దురుసుగా ప్రవర్తించే వారిలో గుబులు..

పోలీసు స్టేషన్‌లలో దురుసుగా ప్రవర్తించే పోలీసు అధికారులు, సిబ్బందిలో గుబులు రేపుతోంది. ఫిర్యాదుదారులతో కొందరు అసహనం వ్యక్తం చేయడం, బయట వెళ్లి కూర్చోమని చెప్పడం, ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం, చిన్నచిన్న దొంగతనాలైనా కేసులు నమోదు చేయకపోవడం, రాజకీయ ఒత్తిడితో కొందరు అధికారులు బాధితుల సమస్యలను పరిష్కరించని వారు క్యూఆర్ కోడ్ ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. వారి పనితీరు బయటపడనుంది. ఆన్‌లైన్ ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పోలీసు స్టేషన్‌లకు గ్రేడింగ్ కల్పించనున్నారు.

పారదర్శకత పెంపొందించేందుకే..



కొంతమంది అధికారుల ప్రవర్తనతో పోలీస్ ప్రతిష్ట దెబ్బతింటోంది. అలాంటి వారిపై స్పెషల్ ఫోకస్ పెట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందించడం జరుగుతోంది. ఇటీవల ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన క్యూఆర్‌కోడ్ సిస్టం గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు నిర్భయంగా మీ పరిధిలో ఉన్న పోలీస్ అధికారుల తీరుపై మీ అభిప్రాయం తెలపాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దీని ద్వారా పోలీస్‌శాఖలో పారదర్శకత పెరుగుతుంది.
– ఎం.శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమిషనర్

ప్రజలు అభిప్రాయం తెలియజేయవచ్చు



పోలీసుల పనితీరుపై ఆన్‌లైన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు. అన్ని పోలీసు స్టేషన్‌లలోని రిసెప్షన్ సెంటర్, స్టేషన్ హౌజ్, ప్రజలు వేచి ఉండే గది, ప్రవేశ ద్వారం ఏర్పాటు చేశాం. ప్రతీ పోలీసు స్టేషన్‌లో క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచాం. సోషల్ మీడియా ద్వారా కూడా తెలియజేస్తున్నాం. తమ అభిప్రాయాన్ని సులభంగా తెలియజేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఐదు అంశాలకు సంబంధించి అభిప్రాయం ఆన్‌లైన్‌లో తెలియజేయవచ్చు.
– గౌస్ ఆలం, ఎస్పీ, ఆదిలాబాద్

నాగోబా జాతర ఏర్పాట్లు ముమ్మరం


సిద్ధమైన హెలిప్యాడ్


గుంతల్లో మొరం పోయిస్తున్న అధికారులు


బ్లేడ్ ట్రాక్టర్‌తో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

ఇంద్రవెల్లి: ఈ నెల 28న నాగోబా జాతర షురూ కానుంది. ఇప్పటికే మెస్రం వంశీయుల గంగాజల సేకరణ పాదయాత్ర కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గోవడ్, కోనేరుకు రంగులు వేయడంతో పాటు మర్రిచెట్టు, జాతర నిర్వహణ స్థలం వద్ద పిచ్చిమొక్కల తొలగించే పనులు పూర్తి చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మెస్రం వంశీయులు బస చేయనున్న మర్రిచెట్టు తదితర ప్రాంతాల్లో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. శాశ్వతంగా నిర్మించిన మరుగుదొడ్లు, స్నానపు గదుల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ముత్నూర్ నుంచి కేస్లాపూర్ వరకు గల రహదారికి ఇరువైపులా కోతకు గురైన ప్రాంతాల్లో మొరం పోసి బాగు చేశారు. అలాగే నాగోబా ఆలయ సమీపంలో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. జాతర ప్రారంభానికి వారం ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ఖందేవునికి ప్రత్యేక పూజలు

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాన్కాపూర్ గ్రామం వద్ద గల ఖందేవ్ పుణ్యక్షేత్రం సోమవారం ఆదివాసీలతో సందడిగా మారింది. మాసేమాల్ పేన్‌కు సంప్రదాయ ప్రకారం చేపట్టనున్న మహాపూజకు తొడసం వంశీయులు భారీగా తరలివచ్చారు. ఎండ్ల బండిపై కొందరు రాగా కాలినడకన పూజ సామగ్రితో మరికొందరు ఆలయానికి చేరుకున్నారు. రాత్రి మహాపూజ నిర్వహించారు. మంగళవారం ఉదయం 9గంటలకు ఖందేవుని సన్నిధిలో తొడసం ఆడపడుచు నువ్వుల నూనె తాగి మొక్కు తీర్చుకోవడం ఆనవాయితీ అని ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు తెలిపారు.


సంప్రదాయ పూజలు చేస్తున్న తొడసం వంశీయులు

ఢిల్లీకి అతిథులుగా..

- గణతంత్ర వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం
- ఉమ్మడి జిల్లా నుంచి పది మంది ఎంపిక

ఉట్నూర్‌రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న ఢిల్లీలో నిర్వహించనున్న వేడుకల్లో పాల్గొనేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి పది మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా రంగాల్లో వారు చేసిన కృషితో పాటు రూరల్ డెవలప్‌మెంట్, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిపై హ్యాండిక్రాఫ్ట్ విభాగంలో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్‌కు చెందిన జాడే సుజాత, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని కౌఠి గ్రామానికి చెందిన ఎస్.జయంతి రాణి ఎంపికయ్యారు. రూరల్ డెవలప్‌మెంట్ విభాగం నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన పోర్తెట్టి శ్రీదేవి, ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని గిన్నెరకు చెందిన మెస్రం లలిత ఎంపికయ్యారు. పీఎం జన్‌మన్ విభాగం నుంచి ఆదిలాబాద్ జిల్లాలోని ఖండాలకు చెందిన ఆత్రం రాంబాయి, సిడాం భీంరావు, ఉట్నూర్ మండలంలోని ధర్మాజీపేటకు చెందిన కొడప లక్ష్మీబాయి, అయ్యు, మడావి రాంబాయి, మానిక్‌రావు ఎంపికయ్యారు. ఈ నెల 26న కర్తవ్యపథలో జరిగే గణతంత్ర వేడుకలను వీక్షించేందుకు వీరంతా ఢిల్లీ వెళ్లనున్నారు.

సంతోషంగా ఉంది



నాతో పాటు మా గూడెం నుంచి మరో ముగ్గురు ఢిల్లీ రావాలని కరెంటు అధికారులు వచ్చి చెప్పారు. ఢిల్లీకి వెళ్లడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. అక్కడ పెద్దపెద్ద సార్లను కలుస్తామంట. మేము వేడుకల్లో పాల్గొనడంతో పాటు మా గూడెం సమస్యలు కూడా సార్లకు విన్నవిస్తాం.
– మానిక్‌రావు, ధర్మాజీపేట, ఉట్నూర్

మరింత ఉత్సాహంతో పనిచేస్తా



కౌటాల: మండలంలోని కౌఠి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 19 ఏళ్లుగా పిల్లలకు పాఠాలు బోధిస్తున్నా. స్వయంగా పక్షులు, గృహాలు, పువ్వులు, జంతువులు, వాహనాలు, తదితర బొమ్మలను తయారు చేసి వాటి జీవన విధానాలపై చిన్నారులకు వివరిస్తున్నా. పిల్లలకు చదువుపై ఆసక్తి కల్పిస్తున్నా. విభిన్నంగా బోధన చేస్తుండడంతో పీఎం యశస్వి పథకం కింద ఎంపిక చేశారు. కేంద్ర ప్రభుత్వం నా సేవలను గుర్తించి ఢిల్లీ పరేడ్‌కు ఆహ్వానించడం సంతోషాన్నిచ్చింది. మరింత ఉత్సాహంతో పనిచేస్తా.
– ఎస్.జయంతిరాణి, కౌఠి, కౌటాల

ఆనందంగా ఉంది



బెజ్జూర్: జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా మూడేళ్లుగా పనిచేస్తున్నా. మారుమూల బెజ్జూర్ మండలానికి చెందిన నాకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం సంతోషంగా ఉంది. మండలంలో 450 గ్రూపులు, 20 గ్రామ సంఘాలు ఉన్నాయి. రూ.30 నుంచి రూ.200 వరకు పొదుపు చేస్తున్నారు. ఒక్కో గ్రూప్ రూ.50వేల నుంచి రూ.15 లక్షల రుణం తీసుకునే స్థాయికి చేరుకున్నాం. ఢిల్లీలో వేడుకలకు వెళ్లడం సంతోషంగా ఉంది.
– పోర్తెట్టి శ్రీదేవి, కుకుడ, బెజ్జూర్

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు



మొదటి బహుమతి అందుకుంటున్న స్పోర్ట్స్ స్కూల్ జట్టు



ద్వితీయ బహుమతి అందుకుంటున్న ఉమెన్స్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు



తృతీయ బహుమతి అందుకుంటున్న ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు

- విజేతగా నిలిచిన హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ జట్టు
- రన్నరప్‌గా నిలిచిన ఉమెన్స్ ఫుట్‌బాల్ క్లబ్ హైదరాబాద్

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్–13 బాలికల ఫుట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఖేలో ఇండియా గేమ్స్‌లో భాగంగా నిర్వహించిన చాంపియన్‌షిప్ పోటీలు లీగ్ పద్ధతిలో నిర్వహించారు. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్ జట్టు విజేతగా నిలువగా, ఉమెన్స్ ఫుట్‌బాల్ క్లబ్ హైదరాబాద్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఆతిథ్య ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు మూడో స్థానంలో నిలిచింది.

లీగ్స్‌లో సత్తాచాటిన స్పోర్ట్స్ స్కూల్ జట్టు

తెలంగాణ అండర్–13 బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జట్టు సత్తాచాటింది. లీగ్ పద్ధతిలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆడిన ఐదు లీగ్ మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది విజేతగా నిలిచింది. ఉమెన్స్ ఫుట్‌బాల్ క్లబ్ హైదరాబాద్ జట్టు నాలుగు మ్యాచ్‌లు గెలిచి ద్వితీయ బహుమతి సాధించగా.. ఆతిథ్య ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు తృతీయ బహుమతి గెలుచుకుంది. కేర్ ఫుట్‌బాల్ అకాడమీ నిజామాబాద్‌కు అలాఫ్‌ఖాన్ ట్రోఫీ, బెస్ట్ ఫెయిర్ ప్లే జట్టుగా ట్విన్ సిటీస్ హైదరాబాద్ జట్టుకు, బెస్ట్ డిసిప్లిన్ జట్టుగా గజ్వేల్ ఫుట్‌బాల్ అకాడమీ జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో ప్రతిభను చాటిన మరికొంత మంది క్రీడాకారిణులకు బహుమతులు అందజేశారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి..

క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని రెండింటిని సమానంగా స్వీకరించాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. క్రీడాస్ఫూర్తి కలిగిన క్రీడాకారులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, ప్రశాంతతకు దోహదం చేస్తాయని, చదువుతోపాటు క్రీడలకు సమప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఏరియా ఎస్ఓటు జీఎం విజయ్‌ప్రసాద్, సివిల్ డీవైఎస్ఈ శ్రీధర్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, డాక్టర్ శరత్‌బాబు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు పాల్గొన్నారు.

అడవి.. అభివృద్ధి పనుల పరిశీలన

కడెం: కవ్వాల్ టైగర్‌జోన్ నుంచి తరలించిన పాత మైసంపేట్ గ్రామాన్ని విజిలెన్స్ పీసీసీఎఫ్ ఏలూసింగ్ మేరు సోమవారం సందర్శించారు. పునరావాసంలో భాగంగా గ్రామాన్ని తరలించి, ఈప్రాంతంలోని 50 హెక్టార్లలో పెంచుతున్న గడ్డి క్షేత్రాలను పరిశీలించారు. అనంతరం కల్పకుంట వాచ్‌టవర్‌కు చేరుకుని బైనాక్యులర్స్‌తో పక్షులను వీక్షించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీటీ శాంతారాం, విజిలెన్స్ డీఎఫ్‌వో ముకుందారెడ్డి, ఎఫ్‌డీవో భవానీశంకర్, కల్లెడ డీఆర్వో ప్రకాశ్, ఎఫ్ఎస్‌వోలు సురేందర్, వసంత్, పాండురంగ్, ఎఫ్‌బీవో సరిత తదితరులు పాల్గొన్నారు.


గడ్డి క్షేత్రాలు పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ ఏలూసింగ్

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

ముధోల్: హత్య కేసులో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సంజీవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముధోల్‌కు చెందిన కరుణ్ ఇటీవల హత్యకు గురికాగా అతని భార్య ఫిర్యాదు మేరకు మృతుని తండ్రి ఏఎస్సై రాందాస్, బావ కానిస్టేబుల్ అనిల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన ఓల్లెపు సాయన్న ఈ నెల 4న పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. గత మంగళవారం నుంచి ఆచూకీ లభించకపోవడంతో అతని తండ్రి ఓల్లెపు హనుమంతు సోమవారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 7989883565 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

కుభీర్(ముధోల్): మద్యం మత్తులో 100కు కాల్‌చేసిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పీ.రవీందర్ తెలిపారు. మండలంలోని మాలెగాం సమీపంలో ఆదివారం రాత్రి నలుగురు వ్యక్తులు రోడ్డుపై న్యూసెన్స్ చేస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు దీపక్, ఆత్మరాం వారిని సముదాయించి స్వగ్రామమైన సాంవ్లికి పంపించారు. అందులో రోహిత్ అనే వ్యక్తి తాగిన మైకంలో పదేపదే 100కు కాల్‌చేసి పని పేరు చెప్పకుండా విసిగించడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

ఇటుకబట్టీల్లో తనిఖీలు


తనిఖీలు చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

భైంసాటౌన్: భైంసా అటవీ శాఖ రేంజ్ పరిధిలోని పలు ఇటుక బట్టీల్లో సోమవారం అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు జరిపినట్లు భైంసా ఫారెస్ట్ రేంజ్ అధికారి వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా 18 బట్టీలను తనిఖీ చేయగా, వాటిలో ఏడింటిలో బొగ్గు, ఉన్క ఉపయోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. మరో 11 బట్టీల్లో కట్టెలు ఉపయోగించినట్లు గుర్తించగా, వారిపై ఇదివరకే కేసులు నమోదు చేశామన్నారు. మరోమారు కట్టెలు వినియోగించవద్దని హెచ్చరించినట్లు వెల్లడించారు. తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ ఎఫ్ఆర్వో అనిత, డిప్యూటీ రేంజ్ అధికారి ఇర్ఫానొద్దీన్, ఎఫ్ఎస్ఓ రాజా, బీట్ అధికారి అలీం, భైంసా రేంజ్ ఎఫ్ఆర్ఓ వేణుగోపాల్, నిర్మల్, భైంసా, బాసర సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: సారంగపూర్ మండలం బీరవెల్లి ఉద్యోగ సంఘ భవనానికి నిధులు మంజూరు చేయించాలని నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. అధ్యక్షుడు గంగాధర్, సంఘ నాయకులు గంగారెడ్డి, లక్కడి శ్రీనివాస్‌రెడ్డి, లక్కడి శ్రీదేవి, భాస్కర్‌రెడ్డి, గణేశ్, నర్సయ్య, లతీఫ్, శ్యామ్‌కుమార్ ఉన్నారు.

గురుకులాల్లో బంగారు భవిష్యత్తు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం: గురుకులాల్లో చదివిన విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఖానాపూర్ వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. ఉట్నూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నచ్చన్ ఎల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శకుంతలతో కలిసి సోమవారం కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2025కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్ని గురుకులాల్లో డైట్ చార్జీలు పెంచడంతోపాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామన్నారు. సాంఘిక, గిరిజన, బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో ప్రవేశపరీక్ష కోసం ఫిబ్రవరి 1లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు'


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఖానాపూర్: కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్‌పై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్ అన్నారు. పట్టణంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సత్తు మల్లేశ్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. లేకపోతే ఎమ్మెల్యేకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు తోట సత్యం, గుడాల రాజన్న, సచిన్, సజ్జు, భీమన్న, తదితరులు ఉన్నారు.

పంచాయతీలకు నిధుల కొరత


జోహర్‌పూర్ పంచాయతీ భవనం

- జీపీల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు
- పారిశుధ్య కార్మికులకు వేతనాలు కరువు
- నిస్సహాయ స్థితిలో కార్యదర్శులు

లోకేశ్వరం: జిల్లాలోని పంచాయతీలకు నిధుల కొరత వెంటాడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు విడుదల చేసే నిధులను సకాలంలో విడుదల చేయడం లేదు. నిధుల సమస్య వెంటాడుతుండడంతో పాలనకు ఆటంకం ఏర్పడుతోంది. నిధుల కొరతతో ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో కార్యదర్శులు ఉన్నారు. వేతనాలు అందక పారిశుధ్య కార్మికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సర్పంచుల పదవీ కాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన పగ్గాలు చేపట్టారు. నిధులు లేక పంచాయతీలకు ఆర్థికంగా ఇబ్బందిగా మారింది. ఆయా జీపీలకు గత మూడు నెలలకోసారి స్టేట్ ఫైనాన్స్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించేది. 15వ ఫైనాన్స్ నుంచి కేంద్రం నిధులు వచ్చేవి. ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడంతో నిధులు విడుదల కావడం లేదు. దీంతో ఎక్కడ పనులు అక్కడే అన్నచందంగా మారింది. పారిశుధ్య నిర్వహణ ప్రస్తుతం ఇబ్బందిగా మారింది. డీజిల్ లేకపోవడం, ట్రాక్టర్లకు మరమ్మతు లేక వంటి సమస్యలు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులతో రెండు,మూడు రోజులకోసారి ట్రాక్టర్ల ద్వారా చెత్త తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా 1530 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి, పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తే పంచాయతీలు అభివృద్ధిలో ముందుకు సాగే అవకాశం ఎంతైనా ఉంది.

జిల్లాలో..

జిల్లావ్యాప్తంగా 18 మండలాలు, వాటి పరిధిలో 400 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 3 వేలకు జనాభా కలిగిన 47 జీపీలు ఉండగా, 500 జనాభా కలిగిన 67 చిన్న పంచాయతీలు ఉన్నాయి.

వేతనాలు ఇవ్వాలి



ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను నెలనెలా వేతనాలు రావడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం స్పందించి వేతనాలు అందించేలా చర్యలు చేపట్టాలి.

– సిరిపూరం గంగారాం, పారిశుధ్య కార్మికుడు, ధర్మోర

నిధులు కేటాయించాలి



గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ట్రాక్టర్‌కు మరమ్మతు, డీజిల్‌తోపాటు ఇతర పనులకు ఇబ్బందిగా ఉం ది. ప్రభుత్వం పంచాయతీలకు పాలకవర్గాలను ఏర్పాటు చేసే వరకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.

– శ్రీనివాస్, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు

మరో శబరిమల.. కడ్తాల్


కడ్తాల్ అయ్యప్ప ఆలయం

- ఉమ్మడి జిల్లాలోనే తొలి ఆలయం
- ఏటా పెరుగుతున్న అయ్యప్ప భక్తులు
- నేడు కర్పూర మకరజ్యోతి దర్శనం

సోన్: పచ్చని పొలాల మధ్య ఆహ్లాదం పంచే వాతావరణంలో.. స్వర్ణనది తీరాన నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయం మరో శబరిమలగా విరాజిల్లుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అయ్యప్ప స్వామి మాలధారణ, ఆధ్యాత్మిక చింతన, మార్గదర్శకాలను మొదలుపెట్టింది. ఈ పవిత్ర పుణ్యక్షేత్రం సోన్ మండలం కడ్తాల్ గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయం ప్రత్యేకతను చాటుకుంది.

1992లో ఆలయం ప్రారంభం

కడ్తాల్ అయ్యప్ప ఆలయాన్ని 1992లో ప్రారంభించారు. ఈ ఏడాది 3500 మంది భక్తులు దీక్షలు చేపట్టారు. వ్యవస్థాపకుడు, గురుస్వామి నర్సారెడ్డి, అయ్యప్ప భక్తుల కృషితో ఆలయ దినదినాభివృద్ధి చెందుతోంది. స్వర్ణ నదిఒడ్డున ఆలయం ఉండటంతో భక్తులు నదిలో స్నానమాచరించి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా మారింది. శబరిమలలో ఉన్న ఆంజనేయస్వామి తదితర ఆలయాలు కూడా ఇక్కడ ఉంది. శబరిమలలో మాదిరిగా ఇక్కడ 41 రోజుల పాటు నిత్యం పూజా కార్యక్రమాలు కొనసాగుతాయి.

ఘనంగా పూజలు..

ఏటా కార్తీకమాసంలో కార్తీకశుద్ధ పౌర్ణమి నుంచి భక్తులు ఇక్కడి ఆలయంలో మాలధారణ చేసి దీక్ష తీసుకుంటారు. దీక్ష సమయంలో అరట్టు ఉత్సవం, మండల పూజ, మరకజ్యోతి పూజలు ఘనంగా నిర్వహిస్తారు. శబరిమలైలో నిర్వహించే మకర జ్యోతి దర్శనం తరహాలోనే ఇక్కడ కూడా అదే రీతిన ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. శబరిమలైలోని అయ్యప్ప దేవాలయాన్ని పోలి ఉండేలా ఇక్కడ ఆలయాన్ని నిర్మించడం వల్ల ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లా వాసులే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ తోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తుంటారు.

నేడు కర్పూర మకరజ్యోతి దర్శనం

మంగళవారం సంక్రాంతి సంబరాలు ఉంటాయని, ఉదయం స్వామివారి సుప్రభాతసేవ అనంతరం విశేషాలంకరణ చేపట్టనున్నట్లు ఆలయ గురుస్వామి నర్సారెడ్డి తెలిపారు. స్వామివారి ఆభరణాలు, ఉత్సవ విగ్రహాన్ని రథంలో ప్రతిష్ఠించి గ్రామ వీధుల్లో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం శబరిమలలో మకర జ్యోతి దర్శన సమయంలోనే ఇక్కడ కర్పూర మకర జ్యోతి దర్శనం ఉంటుందన్నారు. రాత్రి మహా పడి పూజ నిర్వహిస్తామని, అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు


లక్ష్మణచాంద: మండల కేంద్రంలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

- ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్: పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్యే పి.రామారావుపటేల్ అన్నారు. పట్టణంలోని నర్సింహానగర్‌లో గల నర్సింహా కల్యాణ మండపంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు వేసిన ముగ్గులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని, వారు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సంక్రాంతి సందర్భంగా సంప్రదాయాలు మరిచిపోకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, పోటీల్లో పాల్గొన్నవారందరికీ భగవద్గీత పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు కాశీనాథ్, డా. దామోదర్ రెడ్డి, బబ్రు మహారాజ్, విలాస్ గాదేవార్, ఆర్ఎస్ఎస్ బాధ్యులు దామోదర్, కృష్ణ దాస్, డా. నగేశ్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలోని రామలయంలో ఓ పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు తరలివచ్చి రంగురంగుల ముగ్గులు వేశారు. పోటీల్లో విజేతగా నిలిచిన కొండుకూర్‌కు చెందిన శివానికి రూ.3 వేలు, షీల్డ్ అందజేశారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో ఇనెరా ఫర్టిలైజర్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులు, యువతులు పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. ఇందులో గెలుపొందిన వారికి కంపెనీ ప్రతినిధులు బహుమతులు అందజేశారు.


భైంసాటౌన్: ముగ్గులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


కడెం: బహుమతి అందుకుంటున్న శివాని

వాహనదారులు నిబంధనలు పాటించాలి


కుంటాల: అవగాహన కల్పిస్తున్న పోలీసులు


తానూరు: అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేశ్

భైంసాటౌన్: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పట్టణ ఎస్సై మహమ్మద్ గౌస్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఏఎంసీ కాటన్‌యార్డు ఆవరణలో హైర్ కార్ల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపొద్దని, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఇతర వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై దేవరావ్, సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని లింబా(బి) గ్రామంలో సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై జీవన్ రావు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తానూరు: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై రమేశ్ సూచించారు. మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో వాహనదారులు, ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మాజీ సర్పంచ్ గోపా సాయినాథ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి సన్మానం


ఉపేందర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌కు చెందిన పుప్పాల ఉపేందర్ ఇటీవల బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సోమవారం పలువురు గ్రామస్తులు, అతని మిత్రులు ఉపేందర్‌ను సన్మానించారు. అంతకుముందు పలువురు నాయకులు మండల అధ్యక్షుడు ఉపేందర్‌తోపాటు పట్టణ అధ్యక్షుడు మనోజ్‌లను శాలువాలతో సత్కరించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో నాయకులు బెజ్జంకి వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మధు, ముషీర్, సాయి, నాగేంద్రబాబు, నర్సయ్య, సాయిరాజ్, కిశోర్, పిట్టల భూమన్న, సురేందర్, సాయి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్ ను ఢీ కొట్టిన ట్రక్కు
- బైక్‌పై వస్తున్న శరీరం రెండు ముక్కలు


శ్రీనివాస్ (ఫైల్)

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారి 44పై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వెనుక నుంచి ఢీకొట్టిన ట్రక్కు సుమారు పది మీటర్ల వరకు ఈడ్చుకుంటూ వెళ్లడంతో శరీరం రెండు ముక్కలైంది. బాల్కొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా మార్పెడు మండలం ధర్మారం గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాస్(32) నిర్మల్ జిల్లా సోన్ మండలం బొప్పారం గ్రామంలో పదేళ్లుగా మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బంధువులను ఆర్మూర్ వద్ద బైక్‌పై దింపి తిరిగి బొప్పారం వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన ట్రక్కు ఢీ కొట్టింది. శ్రీనివాస్ బైక్‌పై నుంచి ట్రక్కు కింద పడిపోయాడు. ట్రక్కు సుమారు పది మీటర్ల వరకు ఈడ్చుకుంటూ వెళ్లింది. దీంతో శరీరం నడుం నుంచి రెండు భాగాలుగా విడిపోయింది. అక్కడ భయానక వాతావరణం ఏర్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు నెలల క్రితం భార్య ఆత్మహత్య

బత్తుల శ్రీనివాస్ భార్య బత్తుల ప్రమీల ఆరు నెలల క్రితం కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకుంది. ప్రస్తుతం వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు అనాథలుగా మిగిలి పోయారు.

సోయాబస్తాల తరలింపు



సాక్షి స్పందన

కుంటాల: కుంటాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం వద్ద గత 25 రోజులుగా లారీల కొరత కారణంగా సోయా బస్తాలు తరలించడం లేదు. ఈ విషయమై ఆదివారం సాక్షిలో ఇంకెప్పుడు తరలిస్తరు..? శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న సోయా నిల్వలను సోమవారం తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన బీజేపీ నాయకులు

కడెం: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఇటీవల నియమాకమైన కాశవేణి శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు రితేశ్‌రాథోడ్‌తో కలిసి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మహేందర్ తదితరులు ఉన్నారు.

18వ ఎల్‌పీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం


ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

కుంటాల: మండలంలో లింబా(కె) గ్రామంలో సత్యం భూమన్న స్మారకార్థం నిర్వహిస్తున్న 18వ ఎల్‌పీఎల్ క్రికెట్ పోటీలను ఆయన మనుమడు సత్యం గిరీశ్ సోమవారం గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఆత్మ మాజీ చైర్మన్ సవ్వి అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్రావు పటేల్, వీడీసీ చైర్మన్ ముత్యంరెడ్డి, డైరెక్టర్ గోనె గజ్జారాం, ఎల్‌పీఎల్ చైర్మన్ మల్లారెడ్డి, వైస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, దత్తూరాం పటేల్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: పట్టణంలోని సబ్‌పోస్టాఫీస్ కార్యాలయంలో ఇకపై ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని నిర్మల్ సబ్ డివిజన్ తపాలా అధికారి సందీప్, ఖానాపూర్ పోస్టుమాస్టర్ నవీన్ తెలిపారు. సోమవారం నుంచి స్థానిక పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు తదితరులకు తపాలా శాఖ ఆధ్వర్యంలో పలు పొదుపు పథకాలు ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు.

వాలీబాల్ కిట్లు అందజేత


వాలీబాల్ కిట్ అందజేస్తున్న నరేశ్

కడెం: మండలంలోని పెద్దూర్‌తండాలో యువతకు బీఆర్ఎస్వీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కొప్పుల నరేశ్ సోమవారం వాలీబాల్ కిట్లు అందజేశారు. అదే గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ ఉద్యోగి బిక్యానాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి కోల నరేశ్, తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరం


శిబిరంలో నరేంద్రమహారాజ్ శిష్యులు

ముథోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నరేంద్రమహారాజ్ శిష్యులు సోమవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. శిబిరంలో 10మంది రక్తదానం చేశారు. వైద్యులు విజయ్, శిష్యులు మదన్‌మోహన్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.


ఖానాపూర్: కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు


మామడ: పొన్కల్‌లో..


న్యూవెల్మల్‌లో పాల్గొన్న భక్తులు

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం

ఖానాపూర్/మామడ/సోన్: ఖానాపూర్, మామడ మండల కేంద్రంలోని పొన్కల్, సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామాల్లో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో గోదా రంగనాథ కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు, పూజార్ల ఆధ్వర్యంలో కల్యాణతంతు జరిపించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. న్యూవెల్మల్‌లో జక్కసాయన్న దంపతులు అమ్మవారికి పుస్తెమెట్టెలు అందజేశారు. వీడీసీ సభ్యులు, మహిళలు భక్తుల, గ్రామస్తులు పాల్గొన్నారు.